

# కోటలో నెలవంక



భాగ్యనగర విశిష్ట అతిథి ఇవాంకా ట్రంప్ బుధవారం గోల్కొండ కోటను సందర్శించిన సందర్భంగా ప్రత్యేకంగా 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కిన దృశ్యాలివి.

ఫోటోలు: లవకుమార్





ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 30 నవంబర్ 2017 1



ఈ రోజుల్లో వ్యాపారం చేయాలంటే ఆషామాషీ కాదు. సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా సాంకేతిక సాయం చాలా అవసరం. మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవాలంటే వ్యాపారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి తీరాల్సిందే. డిజిటల్ పరిష్కారాలను ఆశ్రయించాల్సిందే. సరిగ్గా ఇదే పాయింట్‌తో 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' సేవలను అందిస్తున్నారు స్నేహారాజ్, సాహిత్యరాజ్ సిస్టర్స్. 'శ్రీయాల్ టెక్నాలజీ' ద్వారా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలతో పాటు వివిధ సంస్థలకు, ప్రొఫెషనల్స్‌కు కన్సల్టింగ్ సేవలను అందిస్తున్నారు. ఐవోటి, వెబ్, క్లౌడ్, మొబైల్ తదితర టెక్నాలజీ సహాయంతో పరిష్కారాలను సూచిస్తు 'భేష్' అనిపించుకుంటున్నారు. ఆ విశేషాలు మీ కోసం...

స్త్రీ శక్తి



# 'డిజిటల్' సిస్టర్స్!

స్నేహారాజ్, సాహిత్యరాజ్‌లను టెక్నాలజీ సిస్టర్స్ అంటారు. వారి సొంతూరు వరంగల్. అమ్మ శ్రీలత న్యాయవాది. తండ్రి రాజేంద్రకుమార్ చార్టెడ్ అకౌంటెంట్. 'నచ్చిన పని చేయండి...కానీ ఏ రంగం ఎంచుకున్నా సరే వెనుకంజ వేయకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో, సమాజానికి పనికివచ్చేలా పని చేయండి' అని తల్లిదండ్రులు ఇద్దరు ఆడపిల్లల్నీ వెన్నుతట్టి ప్రోత్సహించారు. 'తల్లిదండ్రులు ఇచ్చిన చిరు ప్రోత్సాహమే మమ్మల్ని స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా, స్థిరంగా నిలబడేలా, విజయవంతంగా ముందుకుసాగేలా చేశాయం'టారు ఈ సిస్టర్స్.

### స్వదేశానికి ఏదైనా చేద్దామని...

స్నేహారాజ్ అమెరికాలోని నార్త్‌కెరొలినా యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ మాస్టర్స్ చేశారు. అమెరికా కంపెనీ 'సినాప్సిస్'లో కొంతకాలం పని చేశారు. అక్కడ సోలార్, సెమీ కండక్టర్ వంటి పరిశ్రమల్లో కూడా ఉద్యోగం చేశారు. గ్లోబల్ లెవల్‌లో పరిగణించే పిఎంపి సర్టిఫికేషన్ కూడా ఆమెకు ఉంది. అక్కకు తగ్గ చెల్లెలు సాహిత్య రాజ్. వరంగల్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్' నుంచి కంప్యూటర్స్‌లో డిగ్రీ తీసుకున్నారు. ఆమె ఒరాకిల్ ప్రొఫెషనలేగాక, వెబ్ కాంపొనెంట్ డెవలపర్, జావా ప్రోగ్రామర్ కూడా. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)లో సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రెండేళ్లు పనిచేశారు. అదే సమయంలో అక్క స్నేహ అమెరికాలో మంచి ఉద్యోగ అవకాశాలు వచ్చినా వాటిని వదులుకుని స్వదేశానికి ఏదైనా చేయాలనే తపనతో భారత్‌కు తిరిగివచ్చింది. సాహిత్యకూ సమాజసేవ చేయాలనే ఆలోచన ఉంది. ఇక ఆలస్యం చేయకుండా ఇద్దరూ కలిసి 'శ్రీయాల్ టెక్నాలజీ'కి శ్రీకారం చుట్టారు.

### ఆ సంఘటన వల్లే...

'శ్రీయాల్ టెక్నాలజీ'ని మొదలెడదామన్న ఆలోచన వీళ్లకు ఎలా వచ్చింది? ఇదే ప్రశ్న

అడిగితే 'ఈ ఆలోచన మా బుర్రల్లో తలెత్తడానికి ఒక చిన్న సంఘటన కారణం. మేముండేది గేటెడ్ కమ్యూనిటీలో. అక్కడి గార్డు ఒకరోజు ఆ కమ్యూనిటీలోని రెసిడెంట్ల వివరాలను సేకరించి ఒక పుస్తకంలో రాసుకుంటున్నాడు. అలా మా ఇంటితో పాటు అందరి ఇళ్లకూ వెళ్లి వారి వివరాలను కాగితాల మీద రాసుకున్నాడు. ఇదంతా వృథా ప్రయాస, ఎంతో సమయం పట్టే పనిగా మాకు తోచింది. అంతేకాదు ఆ వివరాలు శాశ్వతంగా భద్రంగా ఉండవు. ఫలితం ఆ గార్డు పడిన శ్రమంతా వృథాగా మిగిలిపోతుందనిపించింది మాకు. ఇది 2015 మాట. అప్పుడు నాకు మా కమ్యూనిటీ డేటా మొత్తం భద్రపరచడానికి యాండ్రాయిడ్ యాప్‌ను తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. అది మా కమ్యూనిటీలోని అందరి సమాచారాన్ని జాగ్రత్తగా ప్రాసెస్ చేస్తుంది. ఈ పనికి పట్టే సమయం చాలా తక్కువ కూడా. నెల రోజులు శ్రమించి ఈ పనిని సాహితి సహాయంతో చేశాను. అలా మా కమ్యూనిటీలో 'జిమ్యాన్' (గేట్ మ్యాన్) లాంచ్ చేశాం. అదే మా తొలి ప్రాజెక్టు' అని స్నేహ తెలిపారు.

### డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో...

ఈ సంఘటన తర్వాత రోజువారి జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు టెక్నాలజీ అవసరం చాలా ఉందనే విషయాన్ని అక్కాచెల్లెళ్లు గుర్తించారు. బిజినెస్ ప్రారంభించాలనుకునే వాళ్లు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యావశ్యకమనే ఆలోచన వారి మనసులో మెరిసింది. ఒక స్టార్టప్ ప్రారంభించి తమ దగ్గర ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, సంస్థలకు, వాణిజ్య నిర్వాహకులకు అందజేస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. అలా ప్రాణం పోసుకుంది 'శ్రీయాల్ టెక్నాలజీ' స్టార్టప్. తమ కస్టమర్ల అవసరాలకు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పరిష్కారాలు సూచించడం ప్రారంభించారు. అందులో భాగంగా కస్టమర్లతో మాట్లాడడమే కాకుండా వారి వర్కు ప్లేసులకు వెళ్లి అన్నీ ప్రత్యక్షంగా చూసి వారికి ఏది అవసరమో చెప్తారు కూడా. టెక్నాలజీని వారి బిజినెస్ అవసరాలకు అనుగుణంగా ఎలా ఉపయోగించుకోవాలో కూడా దగ్గరుండి ఈ అక్కాచెల్లెళ్లు నేర్పిస్తారు. వారందించే సేవల్లో ముందు చెప్పుకున్నవే కాకుండా ఐఒటి బేస్డ్ సిస్టమ్స్ కూడా ఉపయోగిస్తూ కస్టమర్లకు సహాయపడుతున్నారు. బిజినెస్ సంస్థలను డిజిటల్‌గా సాధికారులను చేయడాన్ని ఈ సిస్టర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ఇంతకీ 'శ్రీయాల్ టెక్నాలజీ' అని పేరెందుకు పెట్టారు?' అని అడిగినపుడు ''శ్రీ' అంటే సంపద, 'ఆల్' అంటే అందరికీ. అంటే మా స్టార్టప్ లక్ష్యం అందరికీ సంపదను చేరువ చేయాలనే. వారు అభివృద్ధిపథంలోకి దూసుకుపోవాలనే. అందుకే మా కంపెనీకి 'శ్రీయాల్ టెక్నాలజీ' అని పేరుపెట్టామ'ని చెప్పారు స్నేహ.

### స్ఫూర్తి పొందొచ్చు...

జీఈఎస్ సదస్సుకు హైదరాబాదు వేదిక కావడం నిజంగా గ్రేట్. మాలాంటి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇదొక మంచి అవకాశం. వివిధ దేశాల్లో మహిళా పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న పరిస్థితులు, అభివృద్ధిని ఈ సదస్సు ద్వారా ముఖాముఖి తెలుసుకొని స్ఫూర్తి పొందొచ్చు. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. బిజినెస్‌పరంగా వివిధ దేశాలతో పార్ట్‌నర్‌షిప్స్ సాధ్యమవుతాయి. ఈ తరహా సదస్సుల వల్ల మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లు గ్లోబల్ స్థాయికి వేగంగా ఎదగగలరు కూడా. పైగా ఇలాంటి సదస్సులు స్త్రీపురుషుల మధ్య ఉన్న లింగ వివక్షతను సైతం మెల్లగా చెరిపేస్తాయని బలంగా నమ్ముతున్నాం. ఈ సదస్సులో పాల్గొనే అవకాశం మాకు రావడం నిజంగా మా అదృష్టం.




### కస్టమర్ల సంతృప్తే పెట్టుబడి...

పెట్టుబడి గురించి మాట్లాడుతూ 'మా జీతాలు తీసుకోకుండా వాటిని బిజినెస్‌లో తిరిగి పెడుతున్నాం. నిజానికి ఈ రంగంలో నమ్మకం కుదిరితేనే ప్రాజెక్టులు మన దగ్గరకు వస్తాయి. ఈ క్రమంలో కొన్నిసార్లు మేము మా క్లైయింట్లకు ఉచితంగా కూడా పనిచేసి పెట్టాల్సి వస్తుంది. మేం కొత్త టెక్నాలజీ లేదా సాఫ్ట్‌వేర్ కొనాలన్నా కస్టమర్లకు అందించిన సేవల నుంచి వచ్చే డబ్బునే వాటి మీద వెచ్చిస్తాం. డబ్బు కన్నా కస్టమర్లను సంతృప్తే మా లక్ష్యం. బిజినెస్‌లో భాగంగా ఎప్పటికప్పుడు టెక్నాలజీ పరిజ్ఞానాన్ని పెంచుకుంటుంటాం. కొందరు కస్టమర్లు తమ బిజినెస్ ఆలోచనలు చెప్పి దాన్ని ఎలా అభివృద్ధి చేస్తే బాగుంటుందో అడుగుతుంటారు. అలాంటివారికీ మేం సేవలు అందిస్తాం. బిజినెస్ చేయాలనుకునేవాళ్లకు వారి అవసరాలకు అనుగుణంగా యాప్స్ రూపొందించిపెడతాం. అంకురాలకు కూడా డిజిటల్ టెక్నాలజీపరంగా సలహాలు ఇస్తాం. స్టార్టప్ ఐడియాలకు సాంకేతిక సహాయాన్ని జోడిస్తాం. మేం సేవలు అందించేవాళ్లల్లో డాక్టర్లు, లాయర్లు, పోలీసులు ఇలా ఎందరో ప్రొఫెషనల్స్ ఉన్నారు. ప్రస్తుతం సర్వీసు లైనులో మాత్రమే సేవలు అందిస్తున్నాం.

మా విజయరహస్యం టెక్నాలజీ మీద మాకున్న పట్టు, నైపుణ్యం. కాబట్టి మా స్టార్టప్‌ను మరింత విజయవంతంగా ముందుకు తీసుకెళ్లగలమని నమ్ముతున్నాం. మేమిద్దరం మాకెంతో ఇష్టమైన పని చేస్తున్నాం. అలాంటి చోట కొద్దిగా టైము పట్టినా డబ్బు దానంతట అదే వస్తుందని మా నమ్మకం' అన్నారు స్నేహ. 'వ్యాపార రంగంలోని సవాళ్లని ఎదుర్కోవడానికి సాంకేతికపరిజ్ఞానం, పరిష్కారాలు తప్పనిసరి. మహిళల రక్షణకు ఉపయోగపడే టెక్నాలజీ సేవలు అందించే ఆలోచనలో కూడా మేం ఉన్నాం. మా దగ్గర చాలామంది పనిచేస్తున్నారు. ఎంతమందికి ఉద్యోగాలు కల్పించగలిగితే సమాజానికి అంత సేవ చేసినట్లుగా భావిస్తుంటాం. ఆ రకంగా సామాజిక, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధికి మా వంతు సేవలు అందిస్తున్నాం' అని అంటున్నారీ సిస్టర్స్.

• నవ్య డెస్క్

నగ ధగ

# ముద్దులొలికే ముత్యాల నగలు



ముత్యాల ఆభరణాలతో వచ్చే ఆకర్షణే వేరు. ఎలాంటి చీర కట్టుకైనా, ఆధునిక దుస్తులకైనా నప్పే ముత్యాల ఆభరణాల్లో రకాలు లెక్కలేనన్ని. వీటిలో ఉండే స్టయిల్స్, ఫ్యాషన్స్‌లకు అంతే ఉండదు. అయితే దుస్తులకు తగిన ముత్యాల సెట్‌ను మ్యాచ్ చేసుకోగలిగితేనే అందం, ఆనందం. కాబట్టి ఎలాంటి దుస్తులకు ఎలాంటి ముత్యాల నెక్లెస్‌లు మ్యాచ్ అవుతాయో తెలుసుకోండి.

- **టాంగిల్డ్ పర్ల్ నెక్లెస్:** మెలికలు తిరిగినట్టుండే ముత్యాల నెక్లెస్‌లు అటు చీరలకు, ఇటు చుడీదార్లకు...రెండింటికీ నప్పుతాయి. అయితే చీరల మీదకు పొడవాటి నెక్లెస్‌లు వేసుకుంటే హుందాగా ఉంటుంది. వీటికి మ్యాచింగ్‌గా పెద్ద సైజు ముత్యాల దిద్దులు ధరిస్తే వేడుకల్లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ మీరే అవుతారు. ఇక చుడీదార్ల మీదకు మెడకు దగ్గరగా ఉండే నెక్లెస్‌లు ధరించాలి. చెవులకు ముత్యాల జూకాలను పెట్టుకోవాలి.
- **కుందన్ పర్ల్:** కుందన్‌లతో కలిపి ముత్యాల నెక్లెస్‌లు తయారవుతున్నాయి. తళుక్కున మెరుస్తూ మెడలో నిండుగా కనిపించే ఈ రకం నెక్లెస్‌లను పట్టు, బెనారస్ చీరల మీద ధరిస్తే అందంగా ఉంటాయి. ఈ నెక్లెస్‌ల అంచుల్లో చిన్న ముత్యాలు గుత్తులుగా వేలాడేలా డిజైన్ చేసుకుంటే నెక్లెస్ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
- **కాయిన్ షేప్డ్ పర్ల్ నెక్లెస్:** ముత్యాల్లో నాణం ఆకారంలో ఉండేవీ ఉంటాయి. ఇవి మోడర్న్ దుస్తులు, బోల్డ్ ప్రింట్స్ ఉండే ఫ్యాన్సీ చీరలకు చక్కగా సూటవుతాయి. అయితే ముఖాకృతికి తగ్గట్టు మరీ లావుపాటివి కాకుండా సమమైన సైజులో ఉండే ముత్యాల సెట్‌నే ఎంచుకోవాలి.
- **గోల్డ్ పర్ల్:** బంగారు వర్ణంతో మెరిసిపోయే ముత్యాలే...గోల్డ్ పర్ల్. అందర్లోనూ ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే గోల్డ్ పర్ల్ సెట్ ధరించాలి. నాజూకుగా, అదే సమయంలో ఆధునికంగానూ కనిపించేలా చేసే గోల్డ్ పర్ల్ ప్రస్తుతం సెలబ్రిటీలు అనుసరిస్తున్న ఫ్యాషన్ ట్రెండ్.

